క్లుప్తంగా

29న భక్తాంజనేయస్వామి తిరునాళ్ల

ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామ శివారులో భక్తాంజనేయస్వామి 15వ తిరునాళ్ల ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం స్వామికి నాగవల్లీ దళార్చనలు, విశేష పూజలు నిర్వహించి, సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగిస్తారని చెప్పారు. 30న స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేస్తారన్నారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

నవగ్రహ హోమం



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం విశేష పూజలు చేశారు. ముఖ మండపంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రుత్విక దీక్షాధారణ, పంచగవ్యప్రాశన పూజలు రుతి్వకులు డీడీకే ఆచార్యులు, అనంతాచార్యులు, గోవర్ధన రఘురామ్, సురేషాచార్యులు నిర్వహించారు. ధ్వజ స్తంభానికి విశేష అర్చనలు చేశారు. నవగ్రహ పూజ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. టీటీడీ వేదపండితులు దివి ఫణికుమార్, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మహాశాంతి హోమం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమంలో దాత డి.ప్రభాకరరావు, భువనేశ్వరి పాల్గొన్నారు. ఎండోమెంటు ఈవో జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కార్మికులకు న్యాయం చేయాలి



తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయంగా వారికి రావాల్సిన బకాయిలు చెల్లించాలని దీక్ష చేస్తున్నారని యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షను ఆయన ప్రారంభించి, మద్దతు తెలిపారు. ప్రభుత్వం యాజమాన్యంతో చర్చలు జరిపి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.దానయ్య, నవనీతం, శివకుమారి, గురవయ్య, సుబ్బారావు, సాంబయ్య, రమాదేవి, యెహోషువా పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



మంగళగిరి టౌన్ : పారేపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు అండర్‌పాస్ వద్ద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పారేపల్లి రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు పలు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ పారేపల్లి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలతో పాటు పేదలకు సహాయ సహకారాలు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మంగళగిరి జాయింట్ సెక్రటరి తిరువీధుల కిరణ్, కో–ఆర్డినేటర్ ధనుంజయ్, పారేపల్లి దుర్గాప్రసాద్, జంజనం వరప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం సేవిస్తున్న యువకుల అరెస్ట్

తాడేపల్లిరూరల్ : బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నలుగురిని తాడేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. తాడేపల్లి ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ శివారు ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంటుందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవించినా, గంజాయి తాగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

బేజాత్పురం(తాడికొండ): పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో సముచిత స్థానం ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. బేజాత్పురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై మరింత పోరాటం చేసి ప్రజా పక్షంగా నిలబడి హక్కులు సాధిస్తామన్నారు. త్వరలో నియోజకవర్గంలో పార్టీ అంతర్గత కమిటీల నియామకాలు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే 80శాతం కసరత్తు పూర్తయిందని వివరించారు. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయి కమిటీల నియామకం చేసి పూర్తి స్థాయిలో ముందుకెళ్లనున్నట్లు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో ఇంటింటికీ తిరిగి ఊదరగొట్టిన కూటమి ఎమ్మెల్యేలు ఇప్పుడు గ్రామాల్లో ప్రజలకు సమాధానం చెప్పలేక పర్యటించకుండా పలాయానం చిత్తగిస్తున్నారన్నారు. మోసకారి ప్రభుత్వానికి ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలపై ముందుకెళ్లనున్నట్లు తెలిపారు. బండారుపల్లి గ్రామ సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు దాసరి రాజు, సీనియర్ నాయకుడు వడ్లమూడి రాజేంద్ర ప్రసాద్, షేక్ జానీ, షేక్ కరిముల్లా, బంగారయ్య పాల్గొన్నారు.

రైతు పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి

ఫిరంగిపురం: రైతుల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు ప్రభుత్వ పాలన తెచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదే నన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, సయ్యద్ హబీబుల్లా, డి.సురేష్, చేవూరి రామమోహన్‌రెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, దాసరి మెల్కియా, పెరికల చిన్నా, బి. అంజిరెడ్డి, ఇజ్రాయిల్,రాయప్ప, ఆర్, రంజన్ బాబు, సేవా నాగరాజు, హేమలతారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి నృసింహుని ఆస్థాన అలంకారోత్సవాలు



శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి

మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఆస్థాన అలంకారోత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ఆస్థాన మండపంపై ప్రతిరోజు రాత్రి 7 గంటలకు శ్రీవారి ఆస్థాన అలంకారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు స్వామి వారి మత్స్యావతారం, 18న వటపత్రసాయి, 19న రుక్మిణి హరణం, 20న గోవర్ధనోద్ధరణ, 21న గజేంద్ర మోక్షం, 22న పార్థసారథి, 23న శ్రీరంగనాయకులు, 24న రుక్మిణి కల్యాణం, 25న స్తంభోద్భవం, 26న కాళీయ మర్దనం, 27న పరమపద నాథుడు, 28న శ్రీరామ పట్టాభిషేకం, 29న సాయంత్రం కోదండరాముడు అలంకారోత్సవాలు జరుగుతాయని, 30న ఉగాది తిరు వంజనోత్సవం, పంచాంగ శ్రవణం జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొన్న చాయమ్మ



చాయమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

తెనాలి: ప్రజల కోసం పనిచేసే ఉద్యమ పోరాటాల్లో చాయమ్మలోని సద్గుణాలను స్ఫూర్తిగా తీసుకోవాలని రైతు కూలి సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ సూచించారు. ఇటీవల హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన సీపీఐ (ఎంఎల్) పార్టీ సభ్యురాలు చాయమ్మ సంస్మరణ సభను ఆమె స్వస్థలమైన తెనాలిలో ఆదివారం నిర్వహించారు. ఎన్జీవో కళ్యాణ మండపంలో జరిగిన ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు నేతలు హాజరయ్యారు. అధ్యక్షత వహించిన సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ.. చాయమ్మ జీవిత విశేషాలను తెలియజేశారు. ఆమె తండ్రి సూర్యనారాయణ ఒడిశాలోని జయపూర్‌కు చెందినవారనీ, అక్కడ గల రెండు ప్రింటింగ్ ప్రెస్సుల్లో 30 మంది వరకు గల వర్కర్లతో యూనియన్‌ను స్థాపించారని చెప్పారు. ఎంతగా పోరాడినా యాజమాన్యం స్పందించకపోవటంతో ఒడిశా ఆర్టీసీ యూనియన్ సహకారంతో అక్కడే సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ పెట్టి, వర్కర్లను అన్నిరకాలుగా ఆదుకున్నట్టు చెప్పారు. సూర్యనారాయణ మరణంతో ఆయన పెద్ద కుమార్తె చాయమ్మ బాధ్యతను పార్టీ తీసుకున్నారని తెలిపారు. పార్టీ ప్రతిపాదించిన బొల్లిముంత సాంబశివరావును వివాహం చేసుకున్నట్టు తెలిపారు. అప్పట్నుంచి పార్టీ అప్పగించిన ప్రతిపనినీ నిర్వర్తించినట్టు వివరించారు. రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు భార్గవశ్రీ ప్రసంగించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు మండవ శోభారాణి నిర్వహణలో జరిగిన ఈ సభలో జనసాహితీ నేత దివికుమార్, ప్రజాసాహితీ ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, సీపీఐ తెనాలి కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీపీఎం నేతలు కొల్లిపర బాబూప్రసాద్, ములకా శివ సాంబిరెడ్డి, 'ఇస్కఫ్' బొల్లిముంత కృష్ణ, నాస్తిక సమాజం నేత నండూరి నారాయణ, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, సీపీఐ (ఎంఎల్) నాయకులు కిషోర్‌బాబు, చాయమ్మ కుమార్తెలు మహిత, అనూష మాట్లాడారు. తొలుత చాయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

రోగులకు సేవ.. సాహితీ తోవ

- విభిన్న రంగాల్లో డాక్టర్ దక్షిణామూర్తి ప్రజ్ఞ
- తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తూ మన్ననలు
- వైద్యవిజ్ఞానం, సాహిత్యం, సినిమాలపై రచనలు
- రేపు పరుచూరి రాజారామ్ సాహితీ పురస్కారం ప్రదానం



తెనాలి: వైద్యవృత్తిలో సొంత లాభం మానుకుని రోగుల స్వస్థత లక్ష్యంగా పనిచేస్తున్నారు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి. 1939 సెప్టెంబర్ 2న కృష్ణాజిల్లా గుంటుపల్లిలో జన్మించారు. ఎంబీబీఎస్, ఎండీ చేశాక ప్రభుత్వ సర్వీసులో ఎనిమిదేళ్లు పనిచేశారు. 1973లో తెనాలిలో సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అప్పట్లో తెనాలిలో ఆయనే తొలి ఎండీ (ఫిజిషియన్). 1979లో గుండె జబ్బులకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (కార్డియాక్ మానిటర్, డీఫిబ్రిలేటర్) ప్రారంభించారు. వైద్యవృత్తిలో మానవత్వంతో వ్యవహరిస్తుంటారనే పేరుతెచ్చుకున్నారు. అత్యవసర వైద్యం కోసం తీసుకొచ్చిన రోగికి క్షణం కూడా వృథా చేయకుండా వైద్యం అందిస్తారు. అటూ ఇటూ అయితే తిరిగివస్తాయా?లేదా? అనేది ఆలోచించకుండా మందులు, ఇంజక్షన్లు వాడేస్తారు. ఖరీదయిన మందులు రాస్తేనే రోగుల దృష్టిలో మంచి డాక్టరుగా చలామణి అవుతారనే భావన కలిగిన రోజుల్లో అతి చౌకైన మందులతోనే చికిత్స చేస్తున్నారు. తనకు తెలిసిన వైద్యవిజ్ఞానాన్ని పదిమందికీ పంచాలన్న భావనతో డాక్టర్ దక్షిణామూర్తి పలు వైద్యవిజ్ఞాన వ్యాసాలను రాశారు. పుస్తకాలను రచించారు. ప్రభుత్వ సర్వీసులో ఉండగా 1978లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీలో 'గ్రామీణ ప్రాంతాల్లో గుండెపోటుకు చికిత్స'పై రాసిన వ్యాసానికి 'ధీరేంద్రనాథ్ దత్తా' అవార్డును అందుకోవటం ఇందుకు ప్రేరణ. ఆ క్రమంలో ఆయన కలం నుంచి 'డాక్టరు గారి డైరీ', 'వైద్యవిజ్ఞానం', 'డయాబెటీస్ గైడ్', 'గుండెజబ్బులు–నివారణ', 'అధిక రక్తపోటు' పుస్తకాలు వచ్చాయి. ఇందులో డయాబెటీస్‌పై తొలిసారిగా వచ్చిన వీరి 'డయాబెటీస్ గైడ్' ఏడుసార్లు పునర్ముద్రణ పొందింది. 1981లో తెనాలిలో డయాబెటీస్‌పై సమగ్ర సర్వే చేసి జాతీయ సదస్సులో పత్రసమర్పణ చేశారు. అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్, ఏపీ చాప్టర్‌కు అధ్యక్షునిగా చేశారు. 2009లో గుండెజబ్బులపై చేసిన సర్వే, ఫిజిషియన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. వ్యాధుల నివారణకు కొన్ని వందల వ్యాసాలను పత్రికలకు రాశారు.

చిన్నతనం నుంచే...

సినీరంగ ప్రముఖులతో బంధుత్వం కలిగిన డాక్టర్ దక్షిణామూర్తికి చిన్నతనం నుంచే ఆ రంగంపై ఆసక్తి పెరిగింది. సినిమా మంచీచెడులను విశ్లేషిస్తూ వ్యాసాలు రచించారు. క్లాసికల్ ఫిలిం సొసైటీ, చైతన్య వేదికను స్థాపించి పెద్దల సహకారంతో ఉత్తమ చిత్రాలను ప్రోత్సహించారు. ఉత్తమ దర్శకులు, రచయితలయిన బీఎస్ రెడ్డి, శ్రీశ్రీ, కొ.కు, ఆరుద్ర, దాశరథి, కె.విశ్వనాథ్, సి.నారాయణరెడ్డి, భానుమతి వంటి ప్రముఖులను సత్కరించారు. 'తెలుగులో ఉత్తమ చిత్రాలు', 'కళాత్మక దర్శకుడు బి.ఎన్.రెడ్డి', 'గూడవల్లి రామబ్రహ్మం' పుస్తకాలను రచించారు.

నివారణకు 'నడక' మార్గం..

వ్యాధుల చికిత్సే కాకుండా నివారణ మార్గాలను సూచించడం డాక్టర్ దక్షిణామూర్తి ప్రత్యేకత. నడక ఆవశ్యకతను ప్రచార బాధ్యతగా తలకెత్తుకున్నారు. 2000లో వాకర్స్ క్లబ్‌ను స్థాపించారు. నెలవారీ సమావేశాల్లో వైద్యవిజ్ఞాన ప్రసంగాలు, ఏటా వార్షికోత్సవంలో ఉత్తమ వాకర్స్‌ను సత్కరిస్తున్నారు. ఇటీవలే ఆ సంస్థ రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వైద్యుడిగా రోగుల చికిత్సతోనే సరిపెట్టకుండా బహుముఖ రూపాల్లో సమాజానికి తోడ్పడుతున్నారు. ఆ క్రమంలో పలు అవార్డులనూ అందుకున్నారు.

వైభవోపేతం పునఃప్రతిష్టా మహోత్సవం



తాడికొండ: మండల కేంద్రంలోని గంగా భ్రమరాంబ సమేత శ్రీ గిరీశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో వేకువ జాము నుంచే ప్రత్యేక, యంత్ర పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం 9:09 గంటలకు ధ్వజ స్తంభ ప్రతిష్ట, అనంతరం ఆలయ పునః ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ, పండితులు దిగ్విజయంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. సుమారు 13 వేల మందికి పైగా భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

తాడికొండ: వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన తాడికొండ మండలం రావెల–పొన్నెకల్లు గ్రామాల మధ్య జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ మండలం బేజాత్పురం గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు వడ్లమూడి చిన్నబ్బాయి పని నిమిత్తం తాడికొండ వచ్చాడు. అడ్డరోడ్డు కూడలి నుంచి గ్రామానికి చెందిన బాబు అనే యువకుడి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం అయ్యాడు. పొన్నెకల్లు– రావెల గ్రామాల మధ్య కోల్డ్ స్టోరేజీ వద్దకు వెళ్లగానే వెనుకగా వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

తాడికొండ: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన తుళ్లూరు మండలం మందడం గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. హరిశ్చంద్రాపురం గ్రామానికి చెందిన మట్టుకొయ్య బుల్లి భాస్కర్(41)కు మందడం గ్రామానికి చెందిన మహిళతో 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య వివాదాలు పోలీస్‌స్టేషన్‌కూ చేరాయి. చిన్నపాటి వివాదాలు ఇటీవల కాలంలో పెద్దవిగా మారడంతో శనివారం మధ్యాహ్నం భాస్కర్ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

దేవాలయంలో పరిశుభ్రత



వేణుగోపాల ఆలయం వద్ద కిషోర్ గురూజీ తదితరులు

తెనాలి టౌన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి నిర్వాహకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో చినరావూరులోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని ఆదివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు పట్టణంలోని 122 దేవస్థానాలను శుభ్రం చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవో హరిప్రసాద్, ప్రధాన అర్చకులు కృష్ణామాచార్యులు, యోగ మండలి సభ్యులు అక్షర, లత, రాణి, తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, నాగరాజు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

ప్రజా పక్షమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: ప్రజల పక్షాన పోరాడడంతో పాటు పార్టీని బలోపేతం చేసి, మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసే విధంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో వైఎస్సార్ సీపీ నాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పార్టీ రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధితో పాటు హామీలను నూరుశాతం నెరవేర్చారని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసి, సంక్షేమ పథకాలు అందజేశారని వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై రాష్ట్రవ్యాప్తంగా అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాపోరుకు సిద్ధమయ్యారని, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ కమిటీలు, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. దానిలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలో నూతన కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకువచ్చేవిధంగా అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బాజీ గంగాధర్, సీనియర్ నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు మేకా శివారెడ్డి, పార్టీ అధ్యక్షులు మేకా దామేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు పచ్చల విజయ్‌కుమార్, కళ్లం అరవిందారెడ్డి, నాయకులు మేకా అంజిరెడ్డి, పులి భుజంగరావు, బషీర్, వంశీ, ప్రభాకర్ రెడ్డి, భవనం రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం మరువరానిది



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దుగ్గిరాల: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం రైలుపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే నినాదంతో ఆయన అమరణ నిరాహార దీక్ష చేశారని గుర్తు చేశారు. ఆయన త్యాగ ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడూరు వెంకట్రావు, పసుపులేటి శ్రీనివాసరావు, భాస్కర్, కాకాని శ్రీనివాసరావు, కొంగర సుధీర్‌బాబు, అన్నవరపు సత్యనారాయణ, భాస్కరుని వెంకటేశ్వరరావు, చుండరు లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

కౌలు రైతు మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: వ్యవసాయంలో వచ్చిన నష్టాలను పూడ్చలేక ఆత్మహత్య చేసుకున్న శివారు బడేపురం గ్రామ కౌలు రైతు సంకూరు హృదయరాజు(60) కుటుంబాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పరామర్శించారు. రైతు హృదయ రాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఏడాది 7 ఎకరాల్లో పంటలు సాగు చేయగా తీవ్ర నష్టం వాటిల్లడంతో శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలపడంతో ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. వారికి తగిన గిట్టుబాటు ధరలు కల్పించడం, ఆర్థిక సహకారం అందించడంలో పూర్తిగా విఫలమైందని వజ్రబాబు విమర్శించారు. దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చిన్న హనుమంతరావు, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, కూరపాటి మోషె, మాతంగి మాధవ, షేక్ అజీస్ ఉన్నారు.

వృద్ధుల్లో మానసిక సమస్యలపై అవగాహన



డాక్టర్ నాగరాజకుమారికి సత్కారం

తెనాలి: ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ జి.నాగరాజకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వయోవృద్ధులు సాధారణంగా ఎదుర్కొనే సమస్యలైన ఒంటరితనం, మతిమరపు, ఆందోళన, భయం, మానసిక కుంగుబాటు వంటి అంశాలపై మాట్లాడారు. మానసిక సమస్యలపై సభ్యుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. వాటి నివారణకు తగిన సూచనలను చేశారు. సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పీవీ రామబాబు, కోశాధికారి పి.మల్లికార్జునరావు, సంయుక్త కార్యదర్శి ఆర్.భుజంగరావు. పి.వెంకట్ తదితర సభ్యులు పాల్గొన్నారు. ప్రసంగం అనంతరం డాక్టర్ నాగరాజకుమారిని ఘనంగా సత్కరించారు.

'గరిమెళ్ల' లేని లోటు తీరనిది



గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ చిత్రపటానికి నివాళి

తెనాలి: అన్నమయ్య కీర్తనలను తన గానంతో ప్రజలకు చేరువ చేసిన ప్రఖ్యాత గాయకుడు, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంతాపసభను ఆదివారం రాత్రి తెనాలిలో నిర్వహించారు. పట్టణానికి చెందిన సంగీత సంస్థ 'సంకీర్తన' ఆధ్వర్యంలో స్థానిక హోటల్ కాన్ఫరెన్స్ హాలులో కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పురుషోత్తమరావు మాట్లాడుతూ పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తనలను వెయ్యికి పైగా బాలకృష్ణప్రసాద్ స్వరపరచినట్టు చెప్పారు. ఆ విధంగా అన్నమయ్య కీర్తనల ప్రాచుర్యానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ఆయన అకాలమరణం తీరనిలోటని చెప్పారు. బాలకృష్ణప్రసాద్‌కు సంతాపంగా ఆయన స్వరపరిచిన అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తూ నివాళులర్పించారు. సంగీత విద్వాంసుడు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి సభకు అధ్యక్షత వహించారు. మృదంగ విద్వాంసుడు కాసూరి రామకృష్ణ, టీవీఎస్ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, కొండపి వసుంధర, అదె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. తొలుత బాలకృష్ణప్రసాద్ చిత్రపటం వద్ద ఆయనకు నివాళిగా శ్రద్ధాంజలి ఘటించారు. సంకీర్తన కార్యదర్శి కె.రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

తెనాలిటౌన్: మారీసుపేటలోని 22వ వార్డులో ఆదివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. దివంగత మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఫాతిమా వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిబాబు మాట్లాడుతూ.. ఫాతిమా పేరిట 10 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో షేక్ సుభాని, రావి చిన్ని, ఈదర పూర్ణచంద్, శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, కన్నెగంటి మురళీ, వుయ్యూరు రాజశేఖర్‌రెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.